ఓటీఎస్‌ను రుణగ్రస్తులు వినియోగించుకోవాలి



అంచనా బడ్జెట్ పేపర్లు విడుదల చేస్తున్న సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, డైరెక్టర్లు

అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి

సింహాచలం: అడవివరం కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో 2019 లోపు గోల్డ్‌లోన్ తీసుకుని తిరిగి చెల్లించని వారి కోసం వన్‌టైమ్ సెటిల్ మెంట్(ఓటీఎస్)ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి తెలిపారు. రుణగ్రస్తులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. సొసైటీ మహాజన సభ ఆదివారం స్థానిక ప్రైవేటు కల్యాణమండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రి అప్పలస్వామి మాట్లాడుతూ సొసైటీని అభివృద్ధి పథంలో నడిపించడానికి సంఘ సభ్యులంతా సహకరించాలన్నారు. రుణాలు తీసుకున్న వారంతా సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి దోహదపడాలని సూచించారు. బంగారు రుణాలపై ఇప్పటికే దఫదఫాలుగా వడ్డీ తగ్గించామన్నారు. ప్రస్తుతం 12 శాతం వడ్డీ మాత్రమే వసూలు చేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలికంగా ఉన్న బంగారు రుణాలు చెల్లించని వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. దాని ప్రకారం 2019 లోపు ఉన్న దీర్ఘకాలిక బంగారు రుణాలు ఉన్నవారంతా వన్‌టైమ్ సెటిల్ మెంట్‌ను వినియోగించుకోవాలన్నారు. దాదాపు 300 మంది దీర్ఘకాలిక రుణగ్రహస్తులు ఉన్నట్టు తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు 31తో ఓటీఎస్ గడువు ముగుస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా 2023–24 సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టారు. సమావేశంలో కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేశ్వరరావు, డైరెక్టర్లు మజ్జి ధర్మరాజు, కొలుసు గురునాథరావు, బోర ప్రసాద రెడ్డి, కోరాడ ఈశ్వరరావు, ఆకుల నాగరాజు, పాలూరి సూరిబాబు, లండ వెంకటరమణ, గుని శెట్టి శ్రీనివాసరావు, గేదెల కృష్ణంనాయుడు, పోలవరపు రాజకుమారి, ఉద్యోగులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

- కొట్టాడంటూ పోలీస్ స్టేషన్‌లో హెచ్‌ఎం ఫిర్యాదు
- నోటీసు ఇచ్చి పంపించామని పోలీసుల వెల్లడి
- రంగంలోకి దిగిన ఎస్పీ మురళీకృష్ణ



మృతుడు దానయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన దానయ్య(17) ఆదివారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. మనస్తాపం వల్లే అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో సున్నితమైన అంశం కావడంతో ఎస్పీ స్థాయి అధికారులు రంగంలోకి దిగారు. ఎటువంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తుండగా, డీఎస్పీ పర్యవేక్షిస్తున్నారు. అచ్యుతాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ మురళీకృష్ణ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పూర్వ విద్యార్థి దానయ్య రెండు రోజుల కిందట పూడిమడక ఉన్నత పాఠశాలకు వెళ్లి అక్కడి ప్రధానోపాధ్యాయునిపై చేయి చేసుకోవడంతోపాటు సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులను టీజింగ్ చేశాడని తెలిపారు. దీంతో హెచ్‌ఎం పోలీసులకు ఫిర్యాదు చేయగా, సదరు పూర్వ విద్యార్థిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి నోటీసు ఇచ్చి పంపించామన్నారు. ఆత్మహత్యకు పాల్పడిన కారణం, ఉన్నత పాఠశాలలో వివాద అంశాలపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తామన్నారు. మరోవైపు పోలీసులు దుర్భాషలాడటంతో మనస్తాపానికి గురై దానయ్య ఆత్మహత్యకు పాల్పడ్డాడనేది అతడి కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టీసీ కోసం హెచ్‌ఎం పలుమార్లు తిప్పించడం వల్లే గొడవ జరిగి ఉంటుందని, అనంతరం పోలీసు కేసులోకి వెళ్లడంతో మనస్తాపానికి గురయ్యాడని మృతుడి సన్నిహితులు వాపోతున్నారు. కుమారుడి మృతితో తల్లి తీవ్ర దుఃఖసాగరంలో మునిగిపోయింది.

ప్రత్యేక పూజలు.. అన్నసమారాధనలు



సింహపురికాలనీలో అన్నసమారాధన నిర్వహిస్తున్న కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



వరలక్ష్మినగర్‌లో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు



వడ్డన చేస్తున్న కర్రి అప్పలస్వామి

సింహాచలం: వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వాడవాడలా అన్న సమారాధనలు నిర్వహించారు. పలు చోట్ల ప్రత్యేక పూజలు చేశారు.జీవీఎంసీ 98వవార్డు సింహపురికాలనీలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్, కాలనీ యూత్ సంయుక్తంగా అన్న సమారాధన నిర్వహించారు. కాలనీ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి, అధ్యక్షుడు డి.కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.అయ్యన్నరావు, కార్యదర్శి జె.మురళీబాబు, సంయుక్త కార్యదర్శి, ఆర్.శ్రీనివాసరావు, సభ్యుడు అప్పలనాయుడు, పూర్వ కార్యదర్శి నడింపల్లి రామరాజు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- జీవీఎంసీ 95వవార్డు వరలక్ష్మినగర్‌లోని గాడ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అన్నసమారాధనను వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. పలువురికి స్వయంగా వడ్డన చేశారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గంట్ల నర్సింహమూర్తి, పువ్వాడ త్రినాథ్, భాగ్యలక్ష్మి, కె.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కాపువీధిలో..

అడవివరంలోని కాపువీధిలో నరసింహ యూత్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి సొంత నిధులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి సత్తిబాబు, ఆకుల నాగరాజు, శ్రీ నృసింహ పెరుమాళ్ పీఠం గురుస్వామి కర్రి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

పరవాడ: వినాయక ఉత్సవాలను మండలంలో పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. పరవాడ బీసీ కాలనీలో ఉప సర్పంచ్ బండారు రామారావు పర్యవేక్షణలో శ్రీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. గణేష్ నిమజ్జనోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నసమారాధనను ఎంపీపీ ప్రారంభించారు. వినాయకుడిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, నాయకులు చల్లా కనకారావు, రెడ్డి శ్రీనివాసరావు, బొద్దపు చిన్నారావు, పైల పైడింనాయుడు, శ్రీగణేష్ యూత్ సభ్యులు ఉన్నారు.

- ఈ. బోనంగిలో శ్రీ వరసిద్ధి వినాయకుడి నిమజ్జనోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్నసమారాధనలో భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో బుగిడి రామగోవిందరావు, చందక గోవిందరాజు, అప్పారావు పాల్గొన్నారు.
- నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కూండ్రపు అక్కయ్యమ్మ, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, పైల మహలక్ష్మి, పైల కృష్ణ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.



బీసీ కాలనీలో వినాయకుడిని దర్శించుకున్న ఎంపీపీ వెంకటపద్మలక్ష్మి, నాయకులు



వెంకటపతిపాలెంలో కుర్చీలాటలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

పక్కాగా ప్రైవేటు స్కూళ్ల లెక్క

- ఆన్‌లైన్‌లో సమగ్ర వివరాలు నమోదు చేయాల్సిందే..
- గుర్తింపు, రెన్యువల్‌కు ప్రత్యేకంగా 'స్కూల్ మానిటరింగ్ యాప్'
- నిబంధనలు పాటిస్తేనే నిర్వహణకు అనుమతులు
- ప్రైవేటు స్కూళ్లలో అడ్డగోలు ఫీజులకు అడ్డుకట్ట
- స్కూళ్లు యాజమాన్యాలకు అవగాహన సదస్సులు

విశాఖ విద్య: నగరంలోని ఎన్ఏడీ సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్ యాజమాన్యం సీబీఎస్‌సీ చదువుల పేరుతో ఆర్భాటపు ప్రచారం చేసి, విద్యార్థులను చేర్చుకున్నారు. అడ్డగోలుగా ఫీజులు వసూలు చేశారు. కానీ ఆ పాఠశాల నిర్వహణకు ప్రభుత్వం నుంచి పొందిన గుర్తింపు గడువు ముగిసింది. 2023–24 విద్యా సంవత్సరానికి రెన్యువల్ లేకుండానే అడ్మిషన్లు చేపట్టిన విషయం తనిఖీలకు వెళ్లిన విద్యాశాఖాధికారులు గుర్తించారు. ఎందుకిలా చేశారని ఆ పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బ్రాంచిలను నిర్వహిస్తున్న ఓ కార్పొరేట్ పాఠశాలకు నగరంలోని మూడు బ్రాంచిలకు ప్రభుత్వ పరంగా గుర్తింపు రెన్యువల్ ఇవ్వలేదు. పాఠశాల నిర్వహిస్తున్న భవనానికి తగిన ధ్రువ పత్రాలు సమర్పించలేదనే కారణంతో వారికి విద్యాశాఖాధికారులు నోటీసులు జారీ చేశారు. కానీ 2023–24 విద్యా సంవత్సరానికి ఆ పాఠశాల యాజమాన్యం దర్జాగానే విద్యార్థులను చేర్చుకొని, ఇష్టానుసారం ఫీజుల వసూలు చేసేసింది. దినదినాభివృద్ధి చెందుతున్న విశాఖ నగరంలో ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో ఇబ్బడిముబ్బడిగా విద్యాలయాలు వెలుస్తున్నాయి. కానీ సరైన వసతులు, అర్హత గల ఫ్యాకల్టీ, ప్రభుత్వ పరంగా తగిన అనుమతులు లేకుండానే పాఠశాలలు నిర్వహిస్తూ, విద్యార్థుల నుంచి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్‌పెట్టేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే కాలేజీ ఎడ్యుకేషన్, ఉన్నత విద్యా శాఖల్లో అమలు చేస్తున్న విధంగానే ప్రైవేటు పాఠశాలల సమస్త సమాచారాన్ని డిజిటలైజేషన్ చేసేందుకు నిర్ణయించింది. ఒక్క క్లిక్‌తో ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా పాఠశాలల సమగ్ర వివరాలు తెలుసుకునేలా పక్కా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

వివరాల నమోదుకు ప్రత్యేక యాప్

విద్యాశాఖ రూపొందించిన 'స్కూల్ మానిటరింగ్ యాప్'లో ప్రైవేటు స్కూళ్ల సమస్త సమాచారం నమోదు చేయాలి. సొసైటీల ద్వారా నిర్వహిస్తున్నట్లయితే, అందుకు సంబంధించిన ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలి. ఫైర్ సేఫ్టీ, పొల్యూషన్ ధ్రువపత్రాలతో పాటు, పోలీసు శాఖ నుంచి కూడా అనుమతి తీసుకొని ఆ పత్రాలను యాప్‌లో నమోదు చేయాలి. స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరి అర్హత సర్టిఫికెట్లు కూడా పొందుపరచాలి. విద్యాశాఖ నుంచి కేటాయించిన యు–డైస్ కోడ్ ద్వారానే భవిష్యత్‌లో పాఠశాలల్లో విద్యార్థులను చేర్చుకోవాలి. దీని వల్ల విద్యార్థుల తల్లిదండ్రులకు ముందుగానే ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందా ..? లేదా..? పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఏ మేరకు అర్హతలు ఉన్నాయి అనేది తెలుసుకునే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నిర్దేశించిన మేరకే ఫీజులు కూడా వసూలు చేయాలి.

యాజమాన్యాలకు అవగాహన

2023–24 విద్యా సంవత్సరం నుంచే నూతన విధానం ద్వారా ప్రైవేటు స్కూళ్లకు గుర్తింపు, రెన్యువల్ ధ్రువపత్రాలను జారీ చేయాలని విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అవగాహన కల్పించేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాకు పర్యవేక్షణాధికారిగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ రీజినల్ డైరెక్టర్ జ్యోతి కుమారి ఇటీవల ప్రైవేటు యాజమాన్యాలకు సదస్సు ఏర్పాటు చేశారు. ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల వారు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండానే, ఇక నుంచి ఆన్‌లైన్ ద్వారా పాఠశాలలకు అనుమతులు పొందే విధంగా ప్రభుత్వం ఇటువంటి ఏర్పాట్లు చేసింది. స్కూళ్ల సమాచారం అంతా ఆన్‌లైన్ చేయాలనేది మంచి నిర్ణయమే అయినప్పటికీ, దీనికి కొంత గడువు ఇవ్వాలని స్కూళ్ల యాజమాన్యాల అసోసియేషన్ (ఏపీపీయుఎస్ఎంఏ) జిల్లా అధ్యక్షుడు ఎంవీ రావు కోరారు.



ప్రైవేటు యాజమాన్యాలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతి కుమారి

కేంద్ర విధానాలను అడ్డుకుంటాం



ఉక్కు దీక్షలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ అంశం కార్మిక సంక్షేమానికి చేటు అని, కార్మికులందరు కేంద్ర ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్య పోరాటాలతో ఎదుర్కొంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహారీ దీక్షలు ఆదివారం నాటికి 955వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగ కార్మికులతో పాటు విశాఖ భారత్ బచావో సభ్యులు సంఘీభావం తెలిపారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భారత్ బచావో రాష్ట్ర కార్యదర్శి మార్పు శరత్ మాట్లాడుతూ దేశ సంపదను కారుచౌకగా కట్టబెడితే ఫలితంగా మౌలిక సదుపాయాల కల్పనలన్నీ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లి ప్రజలపై పన్నుల భారం పడుతుందన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వరంగ సంస్థలను అభివృద్ధి చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలను దండుకుని ప్రజలను ద్రోహం చేస్తారని విమర్శించారు. అనంతరం భారత బచావో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గూడూరి సీతామహాలక్ష్మి మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న ఉక్కు కర్మాగారాన్ని ఎన్ని త్యాగాలు చేసైనా కాపాడుకుంటామన్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా అధ్యక్షులు వేమన, కార్యదర్శి శ్రీనివాసరావు, గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకులు కే.యస్.యన్, సీఐటీయూ నాయకులు అయోధ్యరామ్, శ్రీనివాసరాజు, వల్లి, ఐఎన్‌టీయూసీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, ఏపీసీయల్‌సీ నాయకులు శ్రీరామమూర్తి, ఏఏపీ నాయకులు శీతల్, భీంసేన్ వార్ నాయకులు చిన్నారావు, రవి, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



30 లోగా ఈ క్రాప్ పూర్తి చేయాలి

వ్యవసాయ అధికారి మోహనరావు



ఈ క్రాప్ నమోదుపై వ్యవసాయ సహాయకులను ఆరాతీస్తున్న వ్యవసాయ అధికారి మోహనరావు

సబ్బవరం: ఈ క్రాప్ నమోదుకు ఈ నెల 30వ తేదీతో గడువు పూర్తవుతుందని అనకాపల్లి జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు చెప్పారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని త్వరితగతిన పంట నమోదుతో పాటు ఈకేవైసీ పూర్తి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. మండలంలోని బోదువలస, మల్లునాయుడుపాలెంలో క్షేత్రస్థాయిలో పంట నమోదు జరుగుతున్న తీరును ఆదివారం ఆయన పరిశీలించారు. పంట నమోదుపై రైతులకు ఉన్న అవగాహనను నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ పంట నమోదు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. రైతులు సాగు చేసిన అన్నిరకాల పంటలు నమోదు చేయాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. ఒక వేళ భూ యజమాని మరణిస్తే సంబంధిత నామినీని గుర్తించి పంట నమోదు చేయాలని సూచించారు. మండలంలో ఈ పంట నమోదు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే మండలంలో పీఎం కిసాన్ కోసం ఈకేవైసీ చేయాల్సిన పెండింగ్ జాబితాపై ఆరా తీశారు. అర్హులైన రైతులను గుర్తించి తక్షణమే ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. రైతులు కూడా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, బోదువలస మాజీ సర్పంచ్ కోన సంజీవరావు, నాయకులు అప్పలనాయుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు పి. హేమలత,బి. రమాదేవి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా నిర్మల నృత్యనికేషన్ వార్షికోత్సవం



నృత్యప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

సింహాచలం: చినముడిపాడకు చెందిన నిర్మలా నృత్యనికేతన్ 42వ వార్షికోత్సవాన్ని సుజాతనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. నృత్యనికేతన్ విద్యార్థులతోపాటు పూర్వ విద్యార్థులు వేడుకల్లో పాల్గొని నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నృత్యనికేతన్ ప్రిన్సిపాల్ బి.విజయజ్యోతిని ఘనంగా సత్కరించారు. నెహ్రూ యువ కేంద్రం యూత్ కోఆర్డినేటర్ మహేశ్వరరావు, డ్యాన్స్ ఇండియా చీఫ్ ఎడిటర్ విక్రమ్‌గౌడ్, ఆంధ్రయూనివర్సిటీ గెస్ట్ డ్యాన్స్ ఫ్యాకల్టీ రాధిక, డాక్టర్ పసుమర్తి వెంకటరమణ, శుక్ల యజుర్వేద పండితుడు డాక్టర్ నిర్మల దరహాస్ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు పోరాటం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పరవాడ: ఉత్తరాంధ్ర జిల్లాల్లో కొనసాగుతున్న స్టీల్ ప్లాంట్ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు పల్లి అప్పారావు కోరారు. పరవాడ సినిమాహాలు కూడలిలో ఆదివారం స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ యాత్ర పోస్టర్లను సీపీఎం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత్ర ఈ నెల 27 నాటికి పరవాడ సినిమాహాలు కూడలికి చేరుతుందని చెప్పారు. స్టీల్ ప్లాంట్‌ను పరిరక్షించుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పాటైన స్టీల్‌ప్లాంటును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బొడ్డు అప్పలనాయుడు, కన్నూరినాయుడు, జి.శ్రీను, వై.చిలుకునాయుడు, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఘనంగా భువనేశ్వరీదేవి అధివాస మహోత్సవం



భువనేశ్వరిదేవిని దర్శించుకుంటున్న ఎంపీపీ సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: మండలంలోని యాతపాలెం శివారు చెల్లయ్యమ్మ తోటలో కొలువైన శ్రీభువనేశ్వరీదేవి అమ్మవారి అధివాస మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. తులసి పత్రితో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన భారీ అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ఎంపీపీ బోకం సూర్యకుమారి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.













